# వెనక్కీ ముందుకీ...

కె. సజయ

'డ్రైవింగ్ స్కూల్' అనే బోర్డు చూసి లోపలికి వెళ్ళింది సరస్వతి. లోపల గోడల నిండా రకరకాల ట్రాఫిక్ గుర్తులతో వున్న చార్టులు ఉన్నాయి. నలుగురైదుగురు మగవాళ్ళు సిగరెట్లు తాగుతూ గోలగోలగా మాట్లాడుకుంటున్నారు. సరస్వతి లోపలికి రావటం చూసి "ఏం కావాలి మేడమ్" అన్నాడు ఒకతను.

"టూ వీలర్ డ్రైవింగ్ నేర్పిస్తారా"

"మేము కారు, జీప్‌లాంటి పెద్ద వెహికిల్సే నేర్పిస్తాం మేడమ్. టూ వీలర్ నేర్పించం. అయినా స్కూటీ, కైనటిక్ లాంటివి నేర్చుకోవటం ఎంతసేపు, మీ ఇంట్లో మగవాళ్ళెవరైనా నేర్పించేయొచ్చు, చాలా ఈజీ" చెప్తున్నాడు అతను. అతని గొంతులో, చూపులో కనీకనిపించని ఎగతాళి. మిగతావాళ్ళు కూడా ఈ మాత్రం ఈవిడకి తెలియదా అన్నట్లు సానుభూతో, ఎగతాళో అర్థంకాని మొహాలతో వున్నారనిపించింది సరస్వతికి.

"నేను కైనటిక్ నేర్చుకుంటానని మీతో అన్నానా, అడక్కుండానే సలహాలు ఇస్తున్నారు" సరస్వతి గొంతులో వినిపించిన కటువుకి కొంచెం తగ్గి- "అది కాదు మేడమ్, లేడీస్‌కి కైనటిక్ బెస్ట్ కదా, అందుకని అలా...."

"చూడండి, నాకు ఏది బెస్ట్ అనేది నాకు తెలుసు. నేనడిగేది మీరు టూవీలర్ గేర్ వెహికిల్స్ డ్రైవింగ్ నేర్పిస్తారా అని?"

సరస్వతి వైపు బిత్తరపోతూ చూశాడతను. "గేర్ బళ్ళు చాలా రిస్క్ అండీ, లేడీస్ నడిపించలేరు...."

ఇక చర్చ అనవసరమనుకుని, అతను పూర్తి చేయకుండానే "థాంక్స్" అంటూ బయటికి వచ్చి బస్‌స్టాప్ వైపు నడుస్తున్న సరస్వతికి చాలా రోజుల నాటి సంఘటన గుర్తొచ్చింది. తను కాలేజీలో డిగ్రీ చదువుతున్నపుడు, పదోతరగతి చదువుతున్న తమ్ముడికి నాన్న దగ్గరుండి స్కూటర్ నేర్పిస్తుంటే తనూ నేర్చుకుంటానని అడిగింది. "స్కూటర్ అమ్మాయిల కెందుకు, కావాలంటే లూనా నేర్చుకో, తేలిగ్గా వుంటుంది. గేరు బళ్ళు అమ్మాయిలు నేర్చుకోలేరు, చాలా కష్టం" అని తనని ఇంకో మాట కూడా మాట్లాడనీయలేదు. ఇంతలో బస్సు రావటంతో సరస్వతి ఆలోచనలోంచి బయటపడి గబగబా బస్సెక్కింది.

* * *     * * *

"మనీషా, స్కూటర్ నేర్చుకోవాలనుకుంటున్నాను. ఎవరన్నా వున్నారా నేర్పించేవాళ్ళు" లంచ్‌టైంలో కొలీగ్ మనీషని అడిగింది సరస్వతి.

"ఏంటి వెహికిల్ కొంటున్నావా? స్కూటీనా, కైనటికా?" ఉత్సాహంగా అడిగింది మనీష.

"ఏదీ కాదు? గేర్ వెహికల్"

"అమ్మో! గేర్ బండా? ఎందుకోయ్ అంత రిస్క్ తీసుకోవటం? ట్రాఫిక్‌లో నడిపించటం చాలా కష్టం అట?"

"రిస్క్ ఏముంది మనీషా, ఏదయినా నేర్చుకోవలసిందేగా? రాకపోతే ట్రాఫిక్‌లో ఏదయినా కష్టమే అవుతుంది."


"ఏమోనబ్బా. నువ్వు అడిగావు కాబట్టి చెబుతున్నా, మన లేడీస్‌కి కైనటిక్ బెస్ట్ అని నా అభిప్రాయం. గేర్ వెహికిల్స్ రిపేర్ వస్తే చాలా కష్టమని అంటారు. తర్వాత నీ ఇష్టం. అయినా వాళ్ళనీ వీళ్ళనీ అడిగే బదులు నేర్పించమని మీ తమ్ముడ్నో, మీ ఆయన్నో అడగొచ్చుగా" అంది మనీష.

"అదీ అయ్యింది. మా తమ్ముడేమో 'నేర్పించేదేంటక్కా, అదే వచ్చేస్తుంది. అయినా నాకెక్కడ టైముంటుంది. సారీ' అనేశాడు. మా ఆయనేమో, ఇదిగో నువ్వన్నమాటే తనూ అన్నాడు. ఆడవాళ్ళకి గేర్‌వెహికిల్స్ కష్టమట, అదీ కాకుండా, చూడటానికి కూడా బాగుండదట! ఇంకా ఏవేవో అన్నాడు. ఈ విషయంలో ఇన్ని సమస్యలున్నాయనే విషయం నా కిప్పుడే అర్థం అవుతోంది."

"అబ్బ పోనిద్దూ. వెధవ బండి గురించి ఇళ్ళల్లో గొడవలు పడ్తామా? ఎందుకొచ్చిన రిస్క్ చెప్పు" అంటున్న మనీషని చూస్తే ఆశ్చర్యమనిపించి, ఇంకమాటలు పొడిగించడం అనవసరం అనుకుంటూనే- "మనీషా, మీ ఆయన కూడా గేర్‌వెహికిల్ నడుపుతారు కదా, వద్దు కష్టమవుతుంది అని ఎప్పుడయినా చెప్పావా?" అనడిగింది సరస్వతి.

"దానికీ, దీనికీ సంబంధమేంటి" అంటూ మొహం ఎర్రగా చేసుకుని గబగబా అక్కడినుంచి వెళ్ళిపోయింది మనీష.

* * *     * * *



'మీరు ఆధునిక స్త్రీ. అందుకే అన్నీ కావాలి మీ స్వంతం. మీ పనుల గురించి వేరొకరి మీద ఆధారపడటం మీకు తప్పనిసరిగా ఇబ్బంది కలిగిస్తుండవచ్చు. అందుకే మీరు కావాలి మీ స్వంత వాహనానికి యజమాని. దానికోసం వుంది మా బ్యాంకు నుంచి రుణ సదుపాయం.'

పెద్ద పెద్ద అక్షరాలతో న్యూస్‌పేపర్‌లో వచ్చిన ఆ ప్రకటన పట్టుకుని బ్యాంక్‌లోనికి వెళ్ళింది సరస్వతి. అంతా హైటెక్ టెక్నాలజీ. కంప్యూటర్లు, మొజాయిక్ ఫ్లోరింగ్, క్రమబద్ధంగా కనిపిస్తున్న ఫర్నిచర్. చూస్తుంటేనే చాలా ముచ్చటేసింది సరస్వతికి. ఎవర్ని అడిగితే వివరాలు తెలుస్తాయో అనుకుంటూ కౌంటర్‌లో వున్న ఒకతనికి ప్రకటన చూపించి వివరాలు కావాలని అడిగింది. అతను కంప్యూటర్ మీద పనిచేస్తూనే చేయి ఒకవైపుకి చూపించి వెళ్ళమన్నట్లు సైగ చేశాడు. అతను చూపించిన వైపు చూస్తే నలుగురైదుగురు కంప్యూటర్స్‌లోకి తలలు దూర్చేసి కనిపించారు. వాళ్ళలో ఎవరిని చూపించి వెళ్ళమన్నాడో అర్థం కాక మళ్ళీ ఏదో అడగబోయింది. అప్పటికే అతను విసుగ్గా మొహం పెట్టేసి, "ఏంటండి, అక్కడ అడగమని చెప్పాను గదా. వెళ్ళండి, ఎందుకు డిస్టర్బ్ చేస్తారు" అంటూ మొహం తిప్పేశాడు. అతని ఎదురుగా వున్న గోడమీద 'వినియోగదారుల సేవకు మేము సదా సిద్ధం' అని తెలుగు, ఇంగ్లీషు, హిందీ భాషలలో చాలా పెద్ద అక్షరాలతో రాసివున్న బోర్డు వుంది. దాన్ని అన్ని భాషలలోనూ చదువుతూ ముందుకి నడిచింది సరస్వతి.

అక్కడ టేబుళ్ళ దగ్గర కూర్చున్న వాళ్ళని పలకరించ

బోయి, 'ఒద్దులే బాబోయ్, కరుస్తారేమో' అనుకుంటూ మేనేజర్ కేబిన్‌లోకి వెళ్ళి, తనను తాను పరిచయం చేసుకుని వచ్చిన పని వివరించింది.

"మీ సర్వీస్ సర్టిఫికెట్, శాలరీ సర్టిఫికెట్ తేవాల్సుంటుంది, అలాగే వెహికిల్ కొటేషన్ కూడా. సరే ఇంతకీ ఏ బండి తీసుకోవాలనుకుంటున్నారు, కైనటిక్‌నా?" అడిగాడు మేనేజర్.

అబ్బ! కనీసం ఈయనన్నా సరిగ్గా మాట్లాడుతున్నాడు అనుకుంటున్న సరస్వతికి ఈ ప్రశ్న వింటూనే చిరాకు అనిపించింది. అయినా, తన చిరాకు మొహం మీద కన్పించనీయకుండా జాగ్రత్తపడి, "కాదండి, గేర్ వెహికిల్ తీసుకోవాలనుకుంటున్నాను"అంది.

"ఓ, అయితే బండి మీ కోసం కాదా? మీ మగవాళ్ళకోసమన్నమాట! బ్యాంక్ ఈ స్కీమ్ పెట్టింది ఉద్యోగినులైన స్త్రీల సౌకర్యం కోసం. చదువుకున్న మీలాంటి స్త్రీలు కూడా ఎందుకు దాన్ని ఇలా దుర్వినియోగం చేస్తారు..." అంటూ ఇంకా ఏదేదో గడగడా మాట్లాడుతున్న అతని వంక గుడ్లప్పగించి బిత్తరపోతూ చూస్తున్న సరస్వతికి తేరుకోవటానికి రెండు నిముషాలు పట్టింది.

"ఒక్క నిముషం కొంచెం ఆగుతారా, మీ బ్యాంక్ నిబంధనల ప్రకారం నాకు లోన్ ఇవ్వటం కుదురుతుందా లేదా అది చెప్పండి చాలు. ఎందుకిదంతా మాట్లాడుతున్నారు" అంది.

"చూడండి మేడమ్, మీరు లేడీస్ వెహికిల్స్ తీసుకుంటే ఇస్తాముగానీ, జంట్స్ వెహికిల్స్‌కు లోన్ ఇవ్వలేము. సారీ" అన్నాడు మేనేజర్.

"అట్లాగా, చాలా థాంక్సండీ. నాకిప్పటి వరకూ లేడీస్ వెహికిల్స్, జంట్స్ వెహికిల్స్ అని విడివిడిగా వుంటాయని తెలీదే! తెలియజేసినందుకు మళ్ళీ థ్యాంక్స్. ఇప్పుడు మీరు చెప్పిన ఇదే విషయాన్ని రాతపూర్వకంగా ఇవ్వగలుగుతారా" చాలా మృదువుగా అడిగింది సరస్వతి.

అప్పటికి గానీ తాను ఏదో పొరపాటు మాట్లాడినట్లు అర్థం కాలేదు ఆయనకి. దాన్ని కప్పి పుచ్చుకోవటం కోసం ఏదో మాట్లాడాలి గనుక, కోపంగా "చూడండి మేడమ్! మాకు చాలా పనులుంటాయి. ఒక్కొక్క వ్యక్తితో ఇంతింత టైమ్ వేస్ట్ చేయలేము. అన్ని సర్టిఫికెట్లు తీసుకుని మళ్ళీరండి" అంటూ ఫైల్‌లో తలదూర్చేశాడు.

'చదువుకున్న మూర్ఖుడు' అనుకుంటూ బయటికి నడిచింది సరస్వతి.

*** ***

" మేడమ్, మీరు లేనప్పుడు ఎవరో సుజాత గారంట, ఫోన్‌చేశారు. మళ్ళీ ఫోన్ చేస్తామన్నారు" అటెండర్ చెప్పాడు సరస్వతి ఆఫీస్‌కి వచ్చిన వెంటనే. సుజాత, సరస్వతికి డిగ్రీలో క్లాస్‌మేట్. స్కూల్లో టీచర్‌గా చేస్తోంది. ఎందుకు చేసిందో అనుకుంటూ వెళ్ళి తన సీట్లో కూర్చుని ఫైల్స్ తెరిచిచూస్తోంది. ఇంతలో "సరస్వతీ మేడమ్ మీకు ఫోన్" అంటూ పిలిచాడు అటెండర్. అవతల సుజాత. వాళ్ళ ఫ్రెండ్ ఆఫీసులో మర్నాడు చిన్న గెట్‌టుగెదర్ లాంటిది వుందట, వస్తావా అని అడుగుతోంది. "చూస్తాను" అని చెప్పి అడ్రసు తీసుకుని ఫోన్ పెట్టేసింది.

సాయంత్రం షోరూమ్‌కు వెళ్ళి బండి కొటేషన్ తీసుకోవాలి అనుకుంటూ, ఈ లోపల శాలరీ, సర్వీస్ సర్టిఫికెట్ తీసుకోవటానికి సూపరింటెండెంట్ దగ్గరికి వెళ్ళి అడిగింది సరస్వతి.

"ఏమ్మా! ఏదన్నా లోన్ తీసుకుంటున్నావా" అడిగాడు ఆయన.

"అవునండి. వెహికిల్ తీసుకోవాలి"

"అలాగా, మంచిదమ్మా. బండి చేతిలో వుంటే మీకు చాలా శ్రమ తప్పుతుంది. బెస్టాఫ్‌లక్" సర్టిఫికెట్స్ ఇస్తూ చెప్పాడాయన.

అమ్మయ్య, ఈయనొక్కడు ఏ వెహికిల్ కొంటున్నారు? ఫలానా బండి మాత్రమే కొనండి అని సలహా ఇవ్వలేదు అనుకుని నిట్టూర్చింది సరస్వతి.

*** ***

ఈ రోజుతో ఈ బండి వ్యవహారం తేలిపోతే బాగుండు అనుకుంటూ, వెస్పా షోరూమ్ వైపు నడిచింది సరస్వతి. షోరూమ్ చాలా పోష్‌గా, మోడర్న్‌గా వుంది. అద్దాల్లోంచి స్కూటర్లు వరసగా నిలబెట్టి కనిపిస్తున్నాయి. రెండు మూడు స్కూటర్ల మీద నీట్‌గా డ్రెస్‌చేసి, కళ్ళకి రేబాన్ కళ్ళజోళ్ళు తగిలించి సినిమా హీరోలాగా బండి నడుపుతున్నట్టువున్న బొమ్మలు కూర్చోపెట్టి ఉన్నాయి.

"వాట్ కెన్ ఐ డూ ఫర్ యూ మేడమ్" తెచ్చిపెట్టుకున్న మర్యాదతో అడిగాడు ఒకతను.

"కొటేషన్ కావాలి"

"ష్యూర్ మేడమ్. ఎవరికోసం మేడమ్ బండి".

"నాకే"

"ఇది గేర్ వెహికిల్ మేడమ్, మీకు కష్టమవుతుంది. లేడీస్‌కి గేర్‌లేని బళ్ళు బెస్ట్" అంటున్నాడు అతను.

"చూడు మిస్టర్, బండి తీసుకునేది నేను. ఏది బెస్ట్ అనేది నేను నిర్ణయించుకోగలను. కష్టమయితే నా ఏడుపు నేను ఏడుస్తాను. నేను బండి కొనటానికి వచ్చాను. నీ ఉచిత సలహాల కోసం రాలేదు. కొటేషన్ ఇస్తావా లేదా వేరే షోరూమ్‌కి వెళ్ళమంటావా" గొంతుపెంచి గట్టిగా అడిగింది సరస్వతి.

సరస్వతి అంత గట్టిగా మాట్లాడుతుందని ఊహించని అతను, ఈవిడకు ఎందుకింత కోపం వచ్చిందో అనుకుంటూ షోరూమ్‌లో వున్న మిగతా అందరూ తమవైపే చూస్తుండటంతో ఇంక ఏమనలేక గబగబా కొటేషన్ రాసి కవర్లో పెట్టి చేతికి ఇచ్చాడు.

*** ***

మర్నాడు సాయంత్రం సుజాత చెప్పిన అడ్రస్‌కి జేరేసరికి ఆరున్నర అయిపోయింది. అయ్యో ఆలస్యమయిపోయానే అనుకుంటూ వెళ్ళింది లోపలికి. లోపల చిన్న మీటింగ్ లాంటిది జరుగుతోంది. సుజాత ఎక్కడుందా అని కళ్ళతోనే వెతికి, వెళ్ళి తన పక్కన కూర్చుని "ఏ విషయం మీద మీటింగ్" నెమ్మదిగా అడిగింది సరస్వతి.

"ఉద్యోగినులైన స్త్రీల రోజువారీ సమస్యల గురించి, నీకు మాట్లాడాలనిపిస్తే నువ్వు మాట్లాడొచ్చు" చెప్పింది సుజాత.

ఒకరొకరుగా అందరూ వాళ్ళవాళ్ళ అనుభవాలు చెబుతున్నారు. ఒక్కొక్కళ్ళు ఒక్కో రంగం. వాళ్ళవాళ్ళ వృత్తుల్లో రోజూ ఎదుర్కొంటున్న సమస్యల గురించి చెబుతున్నారు.

అలా వివిధ రకాల వ్యక్తులు ఒక దగ్గర కూర్చుని మాట్లాడుకోవడం చాలా బాగుంటుందనిపించింది సరస్వతికి.

"మీరు ఏ మాన్న మాట్లాడతారా" ఒకమ్మాయి అడిగింది సరస్వతిని.

"మీరందరూ ఇంత చక్కగా మాట్లాడిన తర్వాత, నాకేం మాట్లాడాలో అర్థం కావడంలేదు"

"ఏదైనా ఫర్లేదు, మాట్లాడు" అంది సుజాత.

గత కొన్ని రోజుల నుండి గేర్‌వెహికిల్ నేర్చుకునే, కొనే విషయంలో తన కెదురవుతున్న అనుభవాల్ని క్లుప్తంగా చెప్పి, ఆడవాళ్ళకు అన్ని రకాల వెహికిల్స్ డ్రైవింగ్ నేర్పించే సంస్థ ఏదైనా వుంటే బాగుంటుందని కూడా చెప్పి ముగించింది సరస్వతి.

"చాలా బాగా మాట్లాడారండి. ఇది చాలా కొత్త విషయం కూడా. ఆడవాళ్ళు పైలట్లుగా, డాక్టర్స్‌గా, పోలీసులుగా ఇంకా చాలాచాలాగా ముందుకు దూసుకు వెళ్ళిపోతున్నారని టీవీలు, పత్రికలు తెగ గగ్గోలు పెట్టేస్తూ వుంటాయి. స్కూటర్ నేర్చుకోవడంలో ఇంతమందికి వ్యతిరేకముంటుందని అస్సలు ఊహించలేదు" అంది ఒకమ్మాయి.

"మనమే ఒక డ్రైవింగ్ స్కూల్ పెడదామా. సైకిల్ దగ్గర్నుంచి బస్, లారీ వరకూ అన్నీ నేర్పించేద్దాం" ఇంకో అమ్మాయి అంది.

"రైలు, విమానం వదిలేశావేం" అని సుజాత అనంగానే అందరూ గలగలా నవ్వేశారు.

మీటింగ్ పూర్తవటంతో సరస్వతి, సుజాత బయటికి వచ్చి నడవటం మొదలుపెట్టారు.

"ఇంతకీ బండి ఎక్కడ నేర్చుకుందామనుకుంటున్నావ్" అడిగింది సుజాత.

"నాకెంత విసుగు వచ్చేసిందో తెలుసా, ఈ బండి నేర్చుకునే విషయంలో. అసలు ఈ ఆలోచనకే ఫుల్‌స్టాప్ పెట్టేయాలన్నంత "అంది సరస్వతి.

"ఈ ఒక్కదానికే ఇలా అంటే ఎలా? మన చుట్టూ ఇంకా చాలా సమస్యలున్నాయిగా సరస్వతి. వాటి గురించి ఆలోచించవద్దా? మా ఫ్రెండ్ ఒకమ్మాయికి గేర్ వెహికిల్ వచ్చు. తనని అగుడుతాను. వచ్చే ఆదివారం యూనివర్సిటీ ప్లేగ్రౌండ్‌కి పొద్దున 8 గంటలకల్లా వచ్చేయ్. ఇద్దరం నేర్చుకుందాం" అంది సుజాత.

"ఓ, థ్యాంక్స్ సుజాత. ఆదివారం తప్పకుండా వస్తాను. మళ్ళీ ఇట్లాంటి మీటింగ్స్ జరిగితే చెప్పు. ఉంటాను మరి" అంటూ ముందుకి నడిచింది సరస్వతి.

" చాలా థాంక్సండీ. నాకిప్పటి వరకూ లేడీస్ వెహికిల్స్, జంట్స్ వెహికిల్స్ అని విడివిడిగా వుంటాయని తెలీదే! తెలియజేసినందుకు మళ్ళీ థ్యాంక్స్. ఇప్పుడు మీరు చెప్పిన ఇదే విషయాన్ని రాతపూరకంగా ఇవ్వగలుగుతారా" చాలా మృదువుగా అడిగింది సరస్వతి.
అప్పటికి గానీ తాను ఏదో పొరపాటు మాట్లాడినట్లు అర్థం కాలేదు ఆయనకి.

